
స్థలాల కబ్జా యత్నంపై ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల స్థలాలపై కన్ను




జిల్లా కేంద్రం చుట్టూ భూముల విలువలు భారీగా పెరగడంతో కబ్జాదారులు గద్దల్లా వాలిపోతున్నారు. ఖాళీ స్థలాలకు రిజిస్ట్రేషన్, ఇతర పత్రాలు సృష్టించి కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజకీయ అండతో పేట్రేగిపోతున్నారు. ఇదే తరహాలో అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లిలో అంగన్‌వాడీల వర్కర్లకు ఇచ్చిన ఇంటి స్థలాలను కాజేయాలని చూస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం అంగన్‌వాడీలకు ఇచ్చిన ఇంటి స్థలాకు దొంగ పత్రాలు సృష్టించి కొందరు తెరపైకి వచ్చారని బాధితులు వాపోతున్నారు. కబ్జాదారులకు రెవెన్యూ శాఖలోని కొంతమంది సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

- అనంతపురం రూరల్


అంగన్‌వాడీ కార్యకర్తకు ఇచ్చిన పట్టా

రెండు దశాబ్దాల క్రితం పట్టాలు
సర్వే చేయించని రెవెన్యూ అధికారులు
ఇదే అదనుగా కబ్జాకు కొందరి ప్రయత్నాలు


ఉప్పరపల్లిలో అంగన్‌వాడీల ఇళ్లకు ఇచ్చిన స్థలం

ఆ భూమి మాదే..

• న్యాయం చేయాలి..

ఇరవై ఏళ్ల కిందట మాకు పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి స్థలాలను అంటిపెట్టుకుని ఉన్నాం. భూమి అనువుగా లేనికారణంగా ఇళ్లను నిర్మించుకోలేకపోయాం. కొలతలు వేసి మా స్థలాలను చూపించాలని సర్వేయర్‌ను అడుగుతూ వస్తున్నాం. సర్వే చేసి ప్లాట్లు చూపిస్తే మాకు న్యాయం జరుగుతుంది. భూమి ఖాళీగా ఉండటంతో తరచూ ఎవరో ఒకరు వచ్చి బెదిరిస్తున్నారు. ఆక్రమణదారులు వచ్చిన ప్రతిసారీ మేము పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు స్పందించి, మాకు స్థలాలను చూపించాలి.



- లక్ష్మీ నరసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త

వందలాది మందికి పట్టాలు

ఉప్పరపల్లి సర్వే నంబరు 107లో 1 నుంచి 7 లెటర్ల వరకు ఉన్న భూమిలో ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు కేటాయించింది. 2011లో మొత్తం 550 మందికి పట్టాలు మంజూరు చేశారు. లబ్ధిదారుల్లో ఆటో డ్రైవర్లు, అంగన్‌వాడీలు తదితరులు ఉన్నారు. సర్వే నంబరు 107-1, 2లోని 1.78 ఎకరాల్లో 69 మంది అంగన్‌వాడీలకు ఇంటి స్థలాలు కేటాయించారు. లబ్ధిదారులు అప్పట్లో బీఎల్వోలుగా పనిచేశారు. ఆ స్థలాలు అనువుగా లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అంగన్‌వాడీలు అప్పట్లో ఇళ్లను నిర్మించుకోలేదు. కానీ తరచూ భూమిని చదును చేసుకుంటూ, స్థలాలను అంటిపెట్టుకుంటూ వస్తున్నారు. ఇళ్ల నిర్మాణం విషయమై గతంలో రెండు మూడు సార్లు అధికారులు కలిసి అర్జీలు ఇచ్చారు. స్పందన లేకపోవడంతో నాలుగైదు నెలల క్రితం పట్టాదారులు సొంతంగా ఇళ్లను నిర్మించుకునేందుకు స్థలాల్లో ఉన్న ముళ్ల పొదలను తొలగించి, చదును చేసుకున్నారు.

మొదట్నుంచీ బెదిరింపులే..

ఇంటి స్థలాల పట్టాలు జారీ అయినప్పటి నుంచి ఎవరో ఒక్కరు వచ్చి ఆ భూమి తమదని బెదిరిస్తున్నారని, కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో పోలీసులు, రెవెన్యూ అధికారులను కలిసి ఫిర్యాదు చేశామని బాధితులు అంటున్నారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమి తమదంటూ బుధవారం వచ్చారని, అక్కడ పాతిన బండలను యంత్రాల సాయంతో తొలగించి చదును చేశారని తెలుస్తోంది. ఈ క్రమంలో బాధితులు మళ్లీ పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.



కొలతలు వేయడంలో జాప్యం

పేదలకు ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులు, కొలతలు వేసి హద్దులు చూపకుండా జాప్యం చేశారు. ఆ స్థలాల్లో ముళ్ల చెట్లు పెరిగిపోయాయని, వాటిని తొలగించి చదును చేసుకుంటామని, కొలతలు వేసి స్థలాలను చూపాలని కొన్నేళ్ల నుంచి లబ్ధిదారులు రెవెన్యూ అధికారులు, సర్వేయర్ల చుట్టూ తిరుగుతున్నారు. 2018లో మండల సర్వేయర్ వచ్చి భూమి కొలతలు వేశారని అంగన్‌వాడీలు చెబుతున్నారు. కానీ, పాత ప్లాన్ ప్రకారం రోడ్లు, ప్లాట్లు చూపించేందుకు స్థలం లేదని చెబుతూ కాలయాపన చేశారని తెలుస్తోంది. దీంతో చేసేదిలేక లబ్ధిదారులే నాలుగైదు నెలల కిందట భూమి చదును చేసుకున్నారు. స్థలాలను అంటిపెట్టుకుని ఉన్నారు. ఇప్పటికైనా సర్వేయర్ వచ్చి కొలతలు వేయిస్తే తమకు న్యాయం జరుగుతుందని అంగన్‌వాడీలు అంటున్నారు.

ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు..

చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నాం. అందుకే ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా ఇళ్లను కట్టుకోలేకపోయాం. స్థలం ఖాళీగా ఉండటంతో నిత్యం ఎవరో ఒకరు వచ్చి ఇబ్బంది పెడుతున్నారు. ఆక్రమించాలని చూస్తున్నారు. ప్రతిసారీ పోలీసులు, రెవెన్యూ అధికారుల దగ్గరకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇప్పుడు మరో వ్యక్తి వచ్చి భూమి తమదని అంటున్నాడు. ఇప్పటికైనా అధికారులు కొలతలువేయిస్తే అప్పోసప్పో చేసి ఇళ్లు కట్టుకుంటాం.



- సునంద, అంగన్‌వాడీ వర్కర్


నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు


మృతిచెందిన ఎద్దులు


గాయపడిన మహేంద్ర


గాయపడిన రాజమ్మ

దొరికారు.. దొంగలు

గొర్రెలను ఎత్తుకుపోతూ.. ఎడ్లబండికి ఢీ పారిపోతుండగా వెంబడించి పట్టుకున్న జనం

విడపనకల్లు, జనవరి 11: గొర్రెలను దొంగతనం చేసి పారిపోతూ.. ప్రమాదానికి గురై దొరికిపోయారు కర్ణాటక దొంగలు. రాయచూరు జిల్లాకు చెందిన ఐదుగురు యువకుల ముఠా గార్లదిన్నె మండలం కల్లూరు ఆంజినేయులుకు చెందిన 15 గొర్రెలను బుధవారం అర్ధరాత్రి దొంగలించింది. బొలెరో వాహనంలో వాటిని బళ్లారికి తరలిస్తుండగా విడపనకల్లు సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న ఎద్దుల బండిని గురువారం ఉదయం 5.30 గంటల సమయంలో వెనక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రెండు ఎద్దులు మృతిచెందాయి. బండిలో ఉన్న మహేంద్ర, రాజమ్మ తీవ్రంగా గాయపడ్డారు. ఐదు గొర్రెలు చనిపోగా, కొన్ని గాయపడ్డాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఐదుగురు దొంగలు వాహనాన్ని వదిలేసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిలో ఒకరికి కాలు విరగడంతో స్థానికులకు దొరికిపోయాడు. మిగిలిన నలుగురు సమీపంలోని కొండల్లోకి పారిపోయారు. బొలెరో వాహనంలోని రెండు సంచుల్లో ఖాళీ గాజు సీసాలు, కొడవళ్లను గమనించిన స్థానికులు.. ఆ యువకులను దొంగలుగా నిర్ధారించుకున్నారు. సుమారు రెండు వందల మంది గ్రామస్థులు వారికోసం కొండల్లో గాలించి, ముగ్గురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిని అశోక్, సంతోష్, మహేశ్‌గా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో తనకు రూ.2.50 లక్షల నష్టం జరిగిందని రైతు ఈశ్వర్ వాపోయాడు. విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


కొండలో దాక్కున్న వారిని పట్టుకువస్తున్న గ్రామస్థులు

ఇళ్ల వద్దకే నోటీసులు

అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఒత్తిడి
31వ రోజూ కొనసాగిన ఆందోళనలు


కలెక్టరేట్ వద్ద తలపై కుర్చీలు పెట్టుకుని నిరసన

అనంతపురం విద్య, జనవరి 11: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఒత్తిడి పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోంది. ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించకూడదో పది రోజుల్లోగా చెప్పాలని కోరుతూ షోకాజ్ నోటీసులను ఇస్తోంది. అంగన్‌వాడీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి మరీ నోటీసులు ఇస్తున్నారు. వారు ఇళ్లవద్ద లేకపోతే.. ఇంటికి నోటీసులు అతికించి, పక్కింటివారితో సంతకాలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం వందలాది మంది వర్కర్లు, ఆయాల ఇళ్ల వద్ద నోటీసులు అతికించారు.

బెదిరించి.. పంపిణీ

అనంతపురంతోపాటు, పలు ప్రాజెక్టుల్లో కొందరు అధికారులు ఆయాలను బెదిరించి, కిట్లు, గుడ్లు వంటి సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయించారని సమాచారం. అనంతపురం నగరంలోని బుడ్డప్ప నగర్, రాణి నగర్, నాయక్‌నగర్ తదితర ప్రాంతాల అంగన్‌వాడీ సెంటర్లలో లబ్ధిదారులకు ఆయాలద్వారా సరుకులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిపిస్తున్నారని కార్యకర్తలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

31వ రోజూ ఆందోళనలు

అంగన్‌వాడీల ఆందోళనలు 31వ రోజు కొనసాగాయి. కలెక్టరేట్ వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూఆధ్వర్యంలో రిలే దీక్షలు నిర్వహించారు. రోడ్డుపైకి వచ్చి తలపై కుర్చీలు పెట్టుకుని ఆందోళన చేశారు. తమతో పెట్టుకుంటే ప్రజాప్రతినిధుల కుర్చీలు తిరగబడతయని హెచ్చరించారు. 31 రోజుల సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెపై స్పందించిన ప్రభుత్వం, అంగన్‌వాడీల సమ్మెపై స్పందించకపోవడం దారుణమని అన్నారు. వెంటనే ఎస్మాను ఉపసంహరించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు తమ వేతనాలను పెంచుకున్నారని, అంగన్‌వాడీల వేతనాలు పెంచమంటే బడ్జెట్ కొరత వస్తుందా అని ప్రశ్నించారు

4,188 మంది షోకాజ్ నోటీసులు

జిల్లా వ్యాప్తంగా 2,209 మంది మెయిన్, మినీ అంగన్‌వాడీ వర్కర్లు, 1,979 మంది హెల్పర్లకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇచ్చింది. మొత్తం 4,188 మందికి రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపించామని ఐసీడీఎస్ పీడీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 47 మంది వర్కర్లు, 38 మంది హెల్పర్లు విధుల్లో చేరారని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారు పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని పీడీ శ్రీదేవి హెచ్చరించారు.


రాణి నగర్ సెంటర్‌కు నోటీసులు అతికించిన ఐసీడీఎస్, సచివాలయ ఉద్యోగులు


ఉరవకొండలో గాంధీ విగ్రహం వద్ద 31 ఆకారంలో కూర్చుని నిరసన

నేటి నుంచి ఓటరు వెబ్‌సైట్ ఫ్రీజ్

22న తుది ఓటర్ల జాబితా విడుదల
కలెక్టర్ గౌతమి



అనంతపురం టౌన్, జనవరి 11: ఎన్నికల వెబ్‌సైట్ శుక్రవారం నుంచి ఫ్రీజ్ అవుతుందని, ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు స్వీకరించబోమని కలెక్టరు గౌతమి తెలిపారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. గత ఏడాది డిసెంబరు 9 వరకు 1,35,684 క్లెయిమ్స్ వచ్చాయని, అందులో 17,047 క్లెయిమ్స్‌ను తిరస్కరించామని తెలిపారు. మిగిలిన 1,18,633 క్లెయిమ్స్‌ను ఆమోదించామని వివరించారు. వీటన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. జీరో ఇంటి నంబర్ కేసులను, ఒకే ఇంటి నంబరుపై 10 కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న వాటిని పరిష్కరించామని తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అన్ని ఫిర్యాదులను విచారించి పరిష్కరించామని, నివేదికను ఎన్నికల కమిషన్‌కు ఇచ్చామని కలెక్టరు తెలిపారు. ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఈ సారి కొత్తగా 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,500 మంది ఓటర్లకు మించకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంట్లోనే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

కొత్త ఓటర్లకు...

ఎన్నికల సమయంలో అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు పదిరోజుల ముందు వరకు కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడానికి అవకాశం కల్పిస్తామని కలెక్టరు గౌతమి తెలిపారు. 01-01-2024 నాటికి 18 సంవత్సరాలు నిండినవారు ఓటు హక్కుకోసం దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో ఏమైన సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు తెలిపారు. సమావేశంలో డీఆర్వో గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగకు వానదెబ్బ


పప్పుశనగ పంట నూర్పిడి పనుల్లో రైతులు



భారీగా తగ్గిన దిగుబడులు

మార్కెట్‌లో తగ్గుతున్న ధరలు
తీవ్రంగా నష్టపోతున్న రైతులు


కోతకు సిద్ధంగా ఉన్న పప్పుశనగ చేను

పప్పుశనగ దిగుబడులు దిగదుడుపుగా వస్తున్నాయి. రబీ ప్రారంభంలో వేసిన పప్పశనగ పంటను నల్లరేగడి రైతులు వారం నుంచి కోస్తున్నారు. గత ఏడాది అక్టోబరు రెండో వారం, నవంబరు మొదటి వారంలో పప్పుశనగ పంట వేశారు. పూత దశలో ఉన్నప్పుడు కురిసిన వర్షాలు నష్టం కలిగించాయి. పూత రాలిపోవడంతో ఆ ప్రభావం దిగుబడులపై పడింది. ఎకరాకు కనీసం ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించిన రైతులకు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా నిరాశేమిగిలింది. కల్లాలు చేసిన రైతులు అతి తక్కువగా వచ్చిన పప్పుశనగ దిగుబడిని చూసి దిగులు చెందారు. రబీలో తొలి వర్షాలకు వేసిన పంట దిగుబడి ఎకరానికి రెండు, మూడు క్వింటాళ్లకు మించడం లేదు.

- గుంతకల్లు

తగ్గిన ధరలు

పప్పుశనగ ధర మార్కెట్‌లో నెల కిందట క్వింటం రూ.6,800 ఉన్నింది. క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.5,600-5,650 ధర పలుకుతోంది. వచ్చే నెలలో పంట కోతలు పెరిగి, ఎక్కువ దిగుబడులు మార్కెట్‌లోకి వస్తాయి. అప్పుడు రేటు మరింత తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్టోబరులో పంటలు పెట్టిన రైతులకు ఎకరాకు రూ.6 వేలదాకా ఖర్చయిందని, రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడిని ప్రస్తుత ధరలకు అమ్ముకుంటే నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రేటు తగ్గుతుందన్న నమ్మకంతో వ్యాపారులు రైతుల నుంచి పప్పుశనగ దిగుబడులను కొనడంలేదు.


పప్పుశనగ పంటను కోసి కుప్పలేసిన కమతం

మూడు క్వింటాళ్లే..

నాకున్న ఆరెకరాల పొలంలో అక్టోబరు 15వ తేదీన పప్పుశనగ పంటపెట్టాను. పూత దశలో వర్షం కురిసి ఆకలపై నీళ్లు చల్లింది. దిగుబడి తగ్గి.. ఎకరానికి మూడు క్వింటాళ్లు వచ్చింది. వర్షం కురవకపోయుంటే మంచి దిగుబడి వచ్చేది. మార్కెట్‌లో ధర కూడా తగ్గిపోయింది. రానున్న రోజుల్లో మరింత తగ్గే ప్రమాదం ఉంది. రెండేళ్ల కిందటి దిగుబడిని శీతల గిడ్డంగిలో ఉంచాను. రేటు రాని కారణంగా వడ్డీ కట్టి నష్టానికి అమ్ముకున్నాను. ఈ ఏడాది ఎకరాకు రూ.6 వేలదాకా ఖర్చు చేశాను. నష్టాలు తప్పేలా లేవు.



- ఉమేశ్, గుంతకల్లు రైతు

కౌలు డబ్బు వచ్చేలా లేదు..



ఎకరానికి రూ.11 వేల ప్రకారం 50 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. 30 ఎకరాలలో పప్పుశనగను, 20 ఎకరాలలో కంది సాగుచేశాను. పప్పుశనగ దిగుబడి ఎకరాకు 2, 3 క్వింటాళ్ల కంటే వచ్చేలా కనిపించడంలేదు. కౌలు డబ్బయినా వస్తుందో లేదో తెలియడంలేదు.

-లాలెప్ప, గుంతకల్లు రైతు

ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణ


ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఏపీ రెడ్డి సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 11: స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏపీ రెడ్డి సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల సమీపంలో 14 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల క్రితం విగ్రహాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేయగా, రెడ్డి సంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఏపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షుడు బయపరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విగ్రహాన్ని ఆవిష్కరించారు. దీంతో వివాదానికి తెరపడింది. కార్యక్రమంలో ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు పాటిల్ రామకృష్ణారెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్ రెడ్డి నివాళి

ఉయ్యాలవాడ కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఊరూపేరులేని వారి విగ్రహాలు పెడితే లేని అభ్యంతరం స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి ఎందుకని ప్రశ్నించారు. తాడిపత్రిలో ఒక ఫ్యాక్షనిస్టు విగ్రహాన్ని ఏర్పాటు చేశారని విమర్శించారు. జాతీయ రహదారులపై విగ్రహాలు ఏర్పాటు చేయకూడదని సుప్రీంకోర్టు ఆర్డర్ స్పష్టంగా ఉందని, హైకోర్టు నుంచి తాను ఆర్డర్ తెచ్చినా ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారని అన్నారు.

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. **- ఆంధ్రజ్యోతి, విజయవాడ**

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), పీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

ఏమో.. ఏమౌనో..!



- వైసీపీ సిట్టింగుల్లో గుబులు
- రాయదుర్గం ఇన్‌చార్జిగా మెట్టు
- ఇప్పటికే పార్టీ వీడిన ఎమ్మెల్యే కాపు
- నాలుగు చోట్ల మార్పులు.. చేర్పులు
- ఇద్దరు సిట్టింగులకు షాక్ ఇచ్చిన వైసీపీ
- ఇక తేలాల్సింది ఎనిమిది మంది భవితవ్యమే..!



అనంతపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టిస్తోంది. దశలవారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారిని ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నారు. ఒకేసారి జాబితా బయట పెట్టకుండా.. దశల వారీగా ఇన్‌చార్జిల నియమకాలు చేపడుతుండటంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కంటిమీద కునుకు కరువైంది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజవకవర్గాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో వైసీపీ 12, టీడీపీ రెండు స్థానాల్లో గెలిచాయి. హిందూపురం, ఉరవకొండలో మాత్రమే టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. రెండు ఎంపీ స్థానాల్లోనూ వైసీపీ ఎంపీలే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ మార్పులకు శ్రీకారం చుట్టింది. కొత్త ఇన్‌చార్జిలే ఈ ఎన్నికల్లో అభ్యర్థులుగా ఉంటారని చెప్పకనే చెబుతోంది.

మూడు దశల్లో నలుగురు..

వైసీపీ అధినాయకత్వం ఇప్పటి వరకూ మూడు దశల్లో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో మార్పులు, చేర్పులు చేసింది. అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శంకర్‌నారాయణను అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను పక్కన పెట్టి, అతని స్థానంలో బళ్లారి మాజీ ఎంపీ శాంతను హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డిని తప్పించి, మక్బూల్ అహ్మద్‌ను ఇన్‌చార్జిగా పెట్టారు. తాజాగా రాయదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి స్థానంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఏపీఐఐసీ ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డిని నియమించారు.

ఎనిమిది మందిలో గుబులు

ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న 12 నియోజకవర్గాల్లో ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఆ నాలుగింటిలో కదిరి, రాయదుర్గం సిట్టింగ్‌లను పక్కన పెట్టారు. ఉష శ్రీచరణ్‌ను పెనుకొండకు, శంకరనారాయణను అనంతపురం ఎంపీ స్థానానికి బదిలీ చేశారు. ఎంపీ రంగయ్యకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశమిచ్చారు. ఇక మిగిలిన శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి, అనంతపురం అర్బన్, ధర్మవరం, పుట్టపర్తి, రాప్తాడు, మడకశిర నియోజకవర్గాల విషయం తేలాల్సి ఉంది. ఇక్కడ ఇన్‌చార్జిల నియామకం ఉత్కంఠ రేపుతోంది. సిట్టింగ్‌లకే అవకాశం ఇస్తారా..? కొత్త వారిని తెచ్చిపెడతారా..? అనే చర్చ జరుగుతోంది. మిగిలిన నియోజకవర్గాల్లో ఇద్దరు, ముగ్గురు సిట్టింగ్‌లను మార్చే అవకాశం ఉందని ఆ పార్టీవారే అంటున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ, హిందూపురం నియోజకవర్గాలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, దీపికా రాణి ఇన్‌చార్జిలుగా ఉన్నారు. ఈ రెండింటిలో మార్పులు, చేర్పులు ఉంటాయా..? లేదా అనే చర్చ జరుగుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పులు అధికార పార్టీలో పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఇప్పటికే రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పార్టీకి గుడ్ బై చెప్పారు. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని సమాచారం. కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్దారెడ్డి తన రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు సమాలోచనలో ఉన్నారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలనే అభిప్రాయంతో ఉన్నారు. ఆయన ఏ పార్టీని ఎంచుకుంటారో వేచి చూడాల్సిందే.

రాష్ట్రానికి జగన్ భస్మాసురుడిలా మారాడు

చంద్రబాబు తప్ప రాష్ట్రాన్ని మరెవరూ కాపాడలేరు

మాజీ మంత్రి పరిటాల సునీత, యువనేత పరిటాల శ్రీరామ్



మాట్లాడుతున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రానికి భస్మాసురుడిలా మారాడని మాజీమంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మండిపడ్డారు. గురువారం అనంతపురంలోని వారి నివాసంలో మీడియాతో మాట్లాడుతూ జగన్ సీఎం అయిననాటి నుంచి రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. వ్యవస్థలను సైతం దెబ్బతీశారన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అడుగడుగునా అవినీతి, దౌర్జన్యాలు, అక్రమ సంపాదనలు మితిమీరాయన్నారు. ఒక్క చాన్స్ పేరుతో గాలివాటంతో అధికారం చేపట్టిన జగన్ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. పరిశ్రమలు తీసుకురాలేదన్నారు. వేలాది మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వ హయాంలో రాప్తాడుకు తీసుకొచ్చిన జాకీ పరిశ్రమను స్థానిక ఎమ్మెల్యే, ఆయన సోదరుల బెదిరింపులతో పొరుగు రాష్ట్రానికి ఆ పరిశ్రమ వెళ్లిపోయిందన్నారు. ఇక ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి భూదందాలతో ఆ ప్రాంతం వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇటు రాప్తాడు, అటు ధర్మవరంలో ఇసుక, గ్రానైట్, మట్టి, రియల్ ఎస్టేట్ మాఫియాలతో రూ. కోట్లు దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ సంపద సృష్టించడంతోపాటు పరిశ్రమల ఏర్పాటు కోసం అడుగులు వేస్తే వైసీపీ హయాంలో ఆ వనరులను దోపిడీ చేస్తూ ముందుకు సాగుతున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా భూముల రికార్డులు తారుమారు చేసి వాటిని అమ్ముకునేందుకు వైసీపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. భూహక్కు చట్టం అమలైతే అనేక ఇబ్బందులు వస్తాయని, వాటిని కూడా ఈ అవినీతి ముఖ్యమంత్రి తాకట్టు పెట్టి రుణాలు తెస్తాడని మండిపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు తప్ప ఈ రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేరన్నారు. వైసీపీ పాలనపై విసిగివేసారిపోయిన ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని చూస్తున్నారన్నారు. అందుకు ఆయన చేపట్టిన రా కదలిరా బహిరంగ సభలకు వస్తున్న జన స్పందనే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రజలకు వైసీపీ చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను ఎత్తిచూపేందుకు చంద్రబాబు రా... కదలిరా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. జగన్ ప్రభుత్వ అవినీతి, అన్యాయాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే.. తాడేపల్లిలో వణుకు మొదలైందన్నారు. ఇటు జనం సైతం భారీగా తరలిరావడంతో టీడీపీలో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోందన్నారు. ఈ ఉత్సాహం చూస్తుంటే.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని సీట్లు గెలవబోతున్నామన్నది స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

కలిసి పనిచేద్దాం

ఎన్నికల వేళ సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, జనవరి 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని విభాగాలు కలిసి సమర్థవంతంగా పనిచేద్దామని ఎస్పీ అన్బురాజన్ పిలుపునిచ్చారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసు, సెబ్, ఎక్సైజ్, ఆర్టీఏ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అటవీశాఖ అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. రాబోవు ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపడదామని అన్నారు. స్టాటిక్ చెక్ పోస్టులు, డైనమిక్ చెక్ పోస్టులలో సమన్వయంతో పనిచేద్దామన్నారు. బెల్టు దుకాణాలు జిల్లాలో ఉండకూడదన్నారు. అక్రమంగా నగదు, బంగారు ఆభరణాల తరలింపు జరగకూడదన్నారు. ఎన్‌డీపీఎల్, డీపీఎల్ నిబంధనల ప్రకారం సీజ్ చేయాలని సూచించారు. ఉన్నది ఉన్నట్లు సీజ్ చేసి వేగవంతంగా డిస్పోజల్ చేయాలన్నారు. కేసు నమోదు, నిందితుల అరెస్టు అంతా చట్టపరంగా ఉండాలని పేర్కొన్నారు. తరలింపుదారులతో పాటు మూలమైన కింగ్‌పిన్‌లను కూడా వదలకూడదని ఆదేశించారు. ఎఫ్‌జే వాష్, ఐడి లిక్కర్, గంజాయి సీజ్ చేయాలని, పీడీ యాక్టుకు అర్హులైన వారిని గుర్తించాలన్నారు. నగదు సీజ్, ఆ తరువాత ప్రక్రియ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అక్రమంగా ఇసుక, మట్టి ఏపీ అనుమతించొద్దన్నారు. అటవీశాఖ పరిధిలోని మెటీరియల్ కూడా అక్రమంగా రవాణా జరుగరాదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, హనుమంతు, రీజనల్ విజిలెన్స్ ఆఫీసర్ మునిరాయమయ్య, డీఎస్పీలు ఆంథోనప్ప, శ్రీనివాసులు, గంగయ్య, నరసింగప్ప, ప్రసాద్‌రెడ్డి, మునిరాజు, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, పరిపాలన అధికారి శంకర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సీఐల బదిలీలు

అనంతపురం క్రైం, జనవరి 11 : జిల్లాలో పలువురు సీఐల బదిలీలు జరిగాయి. ముగ్గురు సీఐలను వీఆర్‌కు పంపారు. ఈ మేరకు గురువారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా పదోన్నతి పొందిన మరో ముగ్గురు సీఐలకు అదే స్థానాలు కేటాయిస్తూ వారికి పోస్టింగ్ ఇచ్చిన తేదీ నుంచి రెగ్యులరైజ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జీటీ నాయుడు	సీసీఎస్,అనంతపురం	సోషల్‌మీడియా, సైబర్ క్రైమ్ సెల్, అనంతపురం
ఎస్.అస్రార్‌బాషా	శింగనమల సర్కిల్	వీఆర్, ఎస్పీ, తిరుపతి
టి.చిన్నగోవిందు	దిశ పీఎస్,అనంతపురం	వీఆర్,ఎస్పీ, చిత్తూరు
బి.లక్ష్మన్న	రాయదుర్గం యూపీఎస్	వీఆర్, ఎస్పీ, తిరుపతి
జి.వెంకటేశులు	బుక్కరాయసముద్రం	బీకేఎస్ పోలీస్‌స్టేషన్, (30.12.2023 నుంచి రెగ్యులరైజ్)
ఎన్‌వీ నాగరాజు	కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్	కళ్యాణదుర్గం రూరల్ పీఎస్ (23.11.2023 నుంచి రెగ్యులరైజ్)
ఎస్ జాకీర్	ఎస్సీ, ఎస్టీ సెల్, అనంతపురం	ఎస్సీ, ఎస్టీ సెల్, అనంతపురం (29.10.2023 నుంచి రెగ్యులరైజ్)

ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు పురస్కారాలు

అనంతపురం క్రైం, జనవరి 11: విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ఎస్పీ అన్బురాజన్ పురస్కారాలు అందజేశారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం సమావేశం నిర్వహించారు. గత నెలలో జరిగిన చోరీ కేసును ఛేదించి రూ.46.55లక్షల రికవరీ చేయడంతో పాటు నలుగురిని అరెస్ట్ చేయడం, 80 కేసుల్లో నిందితుడైన అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్, ఫ్యాక్షన్ గ్రామాల్లో తరచూ సందర్శించి ప్రశాంతత నిర్వహించడం తదితర విధులలో ఉత్తమ సేవలు అందించిన 74మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీలు ఆంథోనప్ప, శ్రీనివాసులు, గంగయ్య, నరసింగప్ప, ప్రసాద్‌రెడ్డి, మునిరాజా, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, పరిపాలన అధికారి శంకర్, లీగల్ అడ్వైజర్ విష్ణువర్దన్‌రెడ్డి, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

అనంతపురం కల్చరల్, జనవరి 11 : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం అణచివేస్తోందని, దీనిని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెపై ఎస్మా చట్టాన్ని ఉపయోగించడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమ్మెకు సంఘీభావంగా, ఎస్మా చట్టాన్ని నిరసిస్తూ నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి తెలుగుదేశం, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ, ఎస్‌యూసీఐ, బీఎస్పీ పార్టీలను, ప్రజాసంఘాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన గడ్డం సుబ్రహ్మణ్యం



నారా లోకేశ్‌తో గడ్డం సుబ్రహ్మణ్యం, లలిత్‌కృష్ణ

అనంతపురం అర్బన్, జనవరి 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో గురువారం కలిసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం తెలిపారు. తన కుమారుడు లలిత్‌కృష్ణతో లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశామన్నారు. దాదాపు 20 నిమిషాల పాటు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించామని, అవకాశం ఉన్న పక్షంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభ్యర్థిత్వానికి తన కుమారుడు లలితకృష్ణను పరిశీలించాలని నారా లోకేశ్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. సామాజిక వర్గాల నేపథ్యంలో ఏ వర్గానికి టికెట్ ఇచ్చినా ఆ అభ్యర్థి విజయం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తామని చెప్పామన్నారు.


టీడీపీతోనే చేనేత రంగం అభివృద్ధి

టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు



అనంతపురం అర్బన్, జనవరి 11: చేనేత రంగం అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ.. వైసీపీలో బీసీలకు విలువ లేదని, సీఎం జగన్ బీసీలను అవమానపరుస్తు హీనంగా చూస్తున్నారని అన్నారు. పద్మశాలి కులానికి చెందిన కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ వైసీపీకి తన పదవికి రాజీనామా చేయడంతోనే వైసీపీ పాలనలో బీసీల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. చేనేత రంగానికి చేయూ తనివ్వకుండా, ఆ వర్గాల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని అన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పి, టీడీపీకి పట్టం కట్టాలని ఆయన కోరారు.

వైసీపీకి పోతుల నాగరాజు గుడ్‌బై



అనంతపురం క్రైం, జనవరి 11: వైసీపీ నాయకుడు పోతుల నాగరాజు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆరునెలల క్రితం వైసీపీ అధినేత, సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. గురువారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీలో చేరిన తరువాత ఇప్పటివరకు వైసీపీ నేతలు ఎవరూ తన ఫోన్‌ను కూడా ఎత్తడం లేదన్నారు. ఎందుకో ఏమో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఉద్యోగులను బానిసగా చూస్తోందని, వారి హక్కులను అడుగుతున్న వారిపై ఎస్మా ప్రయోగించడం సరికాదన్నారు. ఇక ఆ పార్టీలో ఇమడలేక పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తాను స్వతంత్ర్య అభ్యర్థిగా రాప్తాడు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానన్నారు.

టీడీపీ విజయం ఖాయం

రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు



నార్పల, జనవరి 11: రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ విజయఢంకా మోగించడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు ధీమా వ్యక్తం చేశారు. గురువారం నార్పలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రన్న రా కదిలిరా బహిరంగ సభలకు రాష్ట్ర ప్రజలు లక్షల సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు. ఈ సభలకు వచ్చే జనాలను చూసి తాడేపల్లి పిల్లిలో వణుకు మొదలైందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ వైసీపీని తరిమికొట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో వైసీపీకి 20 సీట్లు మించి రావన్నారు.

ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై దృష్టి : ఎస్పీ



అనంతపురం క్రైం, జనవరి 11: ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ సూచించారు. గురువారం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఎస్‌ఐ, ఆపై స్థాయి పోలీస్ అధికారులతో ఎస్పీ నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రశాంతత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం హోదాలు మరిచి సమష్టిగా పనిచేద్దామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, హనుమంతు, డీఎస్పీలు ఆంథోనప్ప, గంగయ్య, నరసింగప్ప, ప్రసాద్‌రెడ్డి, మునిరాజా, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, పరిపాలనాధికారి శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఐలు, ఆర్‌ఐలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

19న వేమన పద్య పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

అనంతపురం కల్చరల్, జనవరి 11: వేమన జయంతిని పురస్కరించుకొని ఈ నెల 19న జిల్లాలోని 100 పాఠశాలల్లో వేమన పద్య పోటీలు నిర్వహిస్తున్నట్లు వేమన ఫౌండేషన్ అధ్యక్షుడు, విశ్రాంత వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆ ఫౌండేషన్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఏటా వేమన జయంతిని అత్యంత ఆడంబరంగా నిర్వహిస్తుంటే ఏపీలోని వైసీపీ ప్రభుత్వం ఇంతవరకూ వేమన జయంతి ప్రస్తావనే తీసుకురాకపోవడం దౌర్భాగ్యకరమన్నారు. ఇప్పటికైనా వేమన జయంతి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, కటారుపల్లిలో ప్రభుత్వమే అధికారికంగా వేడుకను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు శంకర్‌నాయక్, రవీంద్ర, వేమన ఫౌండేషన్ సభ్యులు కృష్ణారెడ్డి, లోకన్న, నాగశేషారెడ్డి, రామ్మోహన్, నరసింహారెడ్డి, కవులు ఏప నాగేంద్ర, పూజారి ఈరన్న పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల సీజ్



సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 11: అనంతపురం, రాప్తాడులో విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. అనంతపురం విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఉన్న గణేష్ గ్యాస్ స్టవ్ సేల్స్ రిపేరి సెంటర్‌లో మూడు, రాప్తాడు నితీస్ హోటల్‌లో మూడు, రాప్తాడు బస్టాండు ఎదురుగా ఉన్న లక్ష్మీగణపతి హోటల్‌లో రెండు గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్న గుర్తించి.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు ఫణీంద్రనాథ్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, ఏఓ వాసుప్రకాష్, ఏఈఈ రవీంద్రనాథ్ రెడ్డి, సీఎస్‌డీటీ జ్యోతి, వీఆర్వో సాయికుమార్ పాల్గొన్నారు.

ఎఫ్‌పీ షాపులపై .. : అనంతపురం రూరల్ చంద్రబాబునగర్‌లో అరుణాబాయి, గౌరమ్మ చెందిన ఎఫ్‌పీ షాపులను అధికారులు తనిఖీ చేశారు. రికార్డుల్లో ఎలాంటి తేడాలూ లేనట్లు అధికారులు గుర్తించారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు జయపాల్‌రెడ్డి, ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసు ప్రకాష్ పాల్గొన్నారు.

18,598 మందికి 'జగనన్న తోడు'

అనంతపురం టౌన్, జనవరి 11 : అనంత జిల్లాలో 18,598మంది చిరు వ్యాపారులకు జగనన్న తోడు రుణం మంజూరైనట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. 8వ విడత కింద మొత్తం మీద రూ19.67 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. అలాగే 22,803 మందికి రూ59.45 లక్షల వడ్డీని రీయింబర్స్‌మెంట్ పంపిణీ చేశామన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌తో ఉపాధి పనులు

కూలీల కడుపుకొడుతున్న అధికార పార్టీ నాయకులు



ఎక్స్‌కవేటర్‌తో ఉపాధి పనులు చేస్తున్న దృశ్యం

ధర్మవరంరూరల్, జనవరి 11: ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో చేయించాల్సిన పనులను అధికార పార్టీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో చేయించి.. నిధులను స్వాహా చేస్తున్నారు. కనగానపల్లి మండలం మామిళ్లపల్లిలో ఉపాధి పథకం కింద ఫారంపాండ్ పనులను అధికార పార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై, ఎక్స్‌కవేటర్‌తో చేయిస్తున్నారు. గురువారం మామిళ్లపల్లి గ్రామ సమీపంలో కొండ్రెడ్డిబావికి వెళ్లే సమీపంలో పెద్దవంకలో ఈ పనులు చేపట్టారు. వారం రోజులు చేయాల్సిన పనులను ఒకేరోజు యంత్రాలతో చేయించి.. కూలీలకు రావాల్సిన సొమ్మును స్వాహా చేసినట్లు సమాచారం. ఉపాధి హామీ పనులను ఎక్స్‌కవేటర్‌తో చేయిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఫోన్‌లో ఏపీఓ వెంకటేష్‌నాయక్ వివరణకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

చంద్రబాబును మళ్లీ సీఎం చేద్దాం

బుక్కరాయసముద్రం, జనవరి 11: రాష్ట్రానికి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని, కావున అందరూ ఆయన్ను సీఎం చేయడానికి కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణీశ్రీ అన్నారు. గురువారం మండలంలోని నీలారెడ్డిపల్లి, పొడరాళ్ల గ్రామంలో బాబ ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మిని మ్యానిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జీసీ బాబు, ఓబులపతి, పెద్దప్ప, జొన్నరామయ్య, రాము పాల్గొన్నారు.

పొడరాళ్లలో ప్రచారం చేస్తున్న బండారు శ్రావణీశ్రీ →



వడ్డె ఓబన్నకు ఘన నివాళి

ధర్మవరం రూరల్, జనవరి 11: స్వాతంత్ర సమరయోధులు వడ్డె ఓబన్న జయంతిని కనగానపల్లి టీడీపీ కార్యాలయంలో వడ్డెరసంఘం నాయకులు గురువారం నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డే ధనలక్ష్మీ, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి వడ్డే వెంకట్, వడ్డే శివానంద, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, కసుమూర్తి వెంకటేష్, ములుగురు సంజీవ్, ఏలకుంట్ల అనిత, రాములమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

ఆత్మకూరు : వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటం వద్ద స్థానిక టీడీపీ నాయకులు పలువురు నివాళులర్పించారు. ఇందులో మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, బీసీ సెల్ నాయకులు రాజా రమేష్, తెలుగు యువత అధ్యక్షులు ఆనంద్, నాగార్జున పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా గురువారం స్థానిక వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పలువురు క్షీరాభిషేకం చేశారు. కేక్‌కట్ చేశారు. చెన్నేకొత్తపల్లిలో వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తహసీల్దార్ షాబుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆదినారాయణ, మల్లికార్జున, వెంకటేశ్, రమణ, రామాంజి, శ్రీనివాసులు, రామప్ప, దుర్గ, నారాయణ, గోపాల్, పెద్దన్న, శీన, అశోక్, ఆనంద్, సూరి పాల్గొన్నారు.



కనగానపల్లి, ఆత్మకూరులో వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

సోమనాథ్‌నగర్‌పై ఎమ్మెల్యే నిర్లక్ష్యం వీడాలి: జనసేన



మురుగుకాలువను పరిశీలిస్తున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 11: స్థానిక సోమనాథ్‌నగర్ సమస్యలపై ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నిర్లక్ష్యం వీడాలని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. గురువారం ఆమె ఆ పార్టీ నాయకులు, వీర మహిళలతో కలిసి సోమనాథ్‌నగర్‌లో పర్యటించారు. వైసీపీ అధికారంలోకి వచ్చి దాదాపు ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా.. సోమనాథ్‌నగర్‌లో చేపట్టిన అభివృద్ధి శూన్యమన్నారు. కాలనీలో రోడ్లు, మురుగు కాలువ నిర్మాణం జరగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగు నీరు ఇళ్లలోకి చేరుతోందని, దీంతో స్థానికులు వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని అన్నారు. గత సంవత్సరం కాలనీలో వరదలు వస్తే.. రూ. 2 వేలు ఆర్థిక సాయం ఇస్తానన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంత వరకూ ఆ సాయం అందించకుండా మోసం చేశారన్నారు. ప్రజలందరూ గమనించి రానున్న వైసీపీని ఓడించి.. జనసేన, టీడీపీ ప్రభుత్వ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నేడు 'అపూర్వ సంగీత విభావరి'

అనంతపురం కల్చరల్, జనవరి 11: పాతపాటల ప్రేమికుల సౌజన్యంతో అనంత సినీ సంగీత కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక మండపంలో స్వరరాగ తరంగిణి - అపూర్వ సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంగీత కళాకారులు, కళాభిమానులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశులు, సంపత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'పంపనూరు' ఈఓగా సాకేతపురం శోభ



ఆత్మకూరు, జనవరి 11: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానం నూతన కార్యనిర్వహణా అధికారిగా సాకేతపురం శోభ నియమిస్తూ దేవదాయ ధర్మాదాయ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఈఓ అక్కిరెడ్డి అనారోగ్య సమస్యలతో సెలవులో వెళ్లడంతో ఆమెను నియమించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 11: స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కిట్స్ సంస్థ అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. హెల్త్‌కేర్, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌పై 60 రోజుల పాటు విజయవాడ నందిగామలో ఉచితంగా శిక్షణ కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం రూ.20 వేలు వేతనంతో కూడిన ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. డిగ్రీ చదివి, 19-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 90004 87423ను సంప్రదించాలని కోరారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

గార్లదిన్నె, జనవరి 11 : పట్రా కులస్థులకు బీసీ-ఏ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురాయుడు పేర్కొన్నారు. గురువారం పట్రా కులస్థులతో కలసి ఆయన డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో పట్రా కులస్థుల రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురాయుడు, గౌరవాధ్యక్షుడు పెద్దపోతుల చిన్న అంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలుపుల శ్రీనివాస్‌నాయుడు, జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు చీమల శ్రీనివాసులు, జీనుగల రమేష్‌బాబు, కార్యదర్శులు మేక రాము, పిల్లల శివరా పాల్గొన్నారు.

ఆగని అంగన్‌వాడీల పోరు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరింది. షోకాజ్ నోటీసులు ఇచ్చినా తమ నిరసన ఆగదని తేల్చిచెప్పారు. శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మెను కొనసాగించారు. శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 366 మంది అంగన్వాడీలకు రిజిస్టర్ పోస్టు ద్వారా అధికారులు షోకాజ్ నోటీసులు పంపినట్లు సమాచారం. గార్లదిన్నె, చెన్నేకొత్తపల్లి, రామగిరిలో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు.

శింగనమలలో..



19 నుంచి కులగణన: కలెక్టర్

అనంతపురం టౌన్ జనవరి 11: జిల్లాలో ఈనెల 19వతేదీ నుంచి కులగణన సర్వే చేపడుతున్నట్లు కలెక్టరు గౌతమి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 19 నుంచి 28వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందన్నారు. కులగణన సర్వేలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ సర్వే చేపడతారన్నారు. ఆ సమయంలో ప్రతిఒక్కరు సహకారం అందించాలని కలెక్టరు కోరారు.

ప్రతి పీహెచ్‌సీలో నెలకు పది కాన్పులు జరగాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్ జనవరి 11: ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనూ నెలకు కనీసం పదికాన్పులు జరగాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి ఆదేశించారు. గురువారం ఆమె జిల్లా కార్యాలయంలో నోడల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాన్పుకు వచ్చే ప్రతి గర్భిణిని రెఫర్‌పేరు తో జిల్లా ఆస్పత్రులకు పంపుతుండటంతో వసతులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కేవలం హైరిస్క్ కేసులను మాత్రమే పంపాలన్నారు. కనీసం నెలకు పదికాన్పులు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇకనుంచి ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు జరగాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యసురక్షక్యాంపులలో వచ్చిన రెఫర్ కేసులకు సంబంధించి సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ రవిశంకర్, గణాంకాధికారి మారుతీప్రసాద్, గోవింద్, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

సార్.. మా జీతాలు పెంచండి

అనంతపురం సెంట్రల్, జనవరి 11: తమ జీతాలు పెంచాలని ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డిని ఎస్కేయూ అకడమిక్ కన్సల్టెంట్లు విజ్ఞప్తి చేశారు. హిందూపురం సమీపంలోని కొండూరులో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. జీఓ 110ను అమలు చేసి నెల వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వీరరాజు, సయ్యద్ ఉస్సేని, జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కరుణాకర్, జమ్మన్న, రాజు, గురుమూర్తి, గణేష్ ఉన్నారు.

కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలి : జేడీ

అనంతపురం టౌన్ జనవరి 11: కుష్టు నిర్మూలనలో భాగంగా బాధితులను గుర్తించడం కోసం చేపడుతున్న ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని వైద్యులు, సిబ్బందికి రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ సూచించారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆయన అనంతపురం, రాప్తాడులో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. కుష్టు బాధితుల వివరాలు, వారికి అందిస్తున్న సేవల రికార్డులను పరిశీలించారు. సర్వే రిపోర్టులను రోజువారిగా పంపించాలన్నారు.

రాప్తాడు పీహెచ్‌సీ తనిఖీ

రాప్తాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రామ్ అధికారి అనుపమ జేమ్స్, సీఎంఓ నాగన్న, వైద్యాధికారి గంగాధర్‌రెడ్డి, శ్రావణి, సూపర్వైజర్లు నరసింహా, అరుణ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఈ మిర్చిపై అవగాహన

అనంతపురం అర్బన్ : ఈ మిర్చి కార్యక్రమంపై స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఉద్యాన అధికారులు, ఆర్బీకే సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ.. మిరప రైతులకు ఈ - మిర్చి కార్యక్రమం ద్వారా పంట సాగులో పాటించాల్సిన ఆధునాతన పద్ధతులపై మెసేజ్, వీడియోల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. మిరప పంట సాగులో కొత్త రకం శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతులకు అందించి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి, ఏడీ నరసింహారావు, ఈ - మిర్చి రాష్ట్ర ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సురేంద్ర పాల్గొన్నారు.



వెంకటేష్‌నాయక్‌ను పరామర్శిస్తున్న వైద్యులు

సర్వజన ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

అనంతపురం టౌన్, జనవరి 11: స్థానిక సర్వజన ఆస్పత్రిలో ఓ వ్యక్తికి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఉరవకొండ మండలం రాకెట్లతండాకు చెందిన వెంకటేష్‌నాయక్ గత నెల 30న తన పొలంలో చెట్టుపై నుంచి పడుతూ.. విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని జిల్లా సర్వజన ఆస్పత్రికి తీసుకురాగా.. సర్వేకల్‌స్పైన్ ఫ్యాక్చర్ అయినట్లు వైద్యులు గుర్తించారు. అవసరమైన ఆపరేషన్ చేశారు. రెండు రోజుల తర్వాత అతనికి విపరీతమైన కడుపునొప్పి రావడంతో వైద్యులు మళ్లీ పరీక్షించి.. అతని పేగుకు రంధ్రం పడినట్లు గుర్తించారు. అప్పటికే స్పైనల్ ఆపరేషన్ జరగడంతో పేగుకు ఆపరేషన్ చేయడానికి మత్తుమందు ఇస్తే ప్రాణానికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. దీంతో అనస్థీషియా డాక్టర్లు కొత్త విధానంలో ప్లెయిన్ బాక్స్ ఇచ్చి.. ఆపరేషన్ చేశారు. జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామినాయక్ నేతృత్వంలో చేసిన ఈ ఆపరేషన్ విజయవంతమైంది. ఇదే ఆపరేషన్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయాలంటే సుమారు రూ 8 లక్షలు వరకు అవుతుందని వైద్యులు తెలిపారు. గురువారం ఆ పేషెంట్‌ను సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత పరామర్శించారు. ఆపరేషన్ చేసిన వైద్యులు రామస్వామినాయక్, నవీన్‌కుమార్ తదితరులను అభినందించారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు అనంత విద్యార్థి



మహేంద్ర ధోని

అనంతపురం సెంట్రల్, జనవరి 11: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించే నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు శ్రీ మాస్టర్ మైండ్ డిగ్రీ కళాశాల విద్యార్థి మహేంద్ర ధోని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్, కరస్పాండెంట్ బసవయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్ర నాసిక్‌లో 27న నిర్వహించే ఫెస్టివల్‌కు ప్రధాని నరేంద్రమోదీ యువతకు సందేశాన్ని ఇస్తారన్నారు. ఈ ఫెస్టివల్‌కు కళాశాల నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థి మహేంద్ర ధోనిని ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ యూత్ అడ్వైజరి భరత్, రమేష్ ఎంపిక చేశారన్నారు.

మరింత అభివృద్ధి చేయండి

జేఎన్‌టీయూకు న్యాక్ మాక్ పీర్ కమిటీ సూచన



సూచనలు ఇస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం సెంట్రల్, జనవరి 11: జేఎన్‌టీయూకి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) సంస్థచే గుర్తింపు పొందే అన్ని అర్హతలూ ఉన్నాయని, మరింత అభివృద్ధి సాధిస్తే గుర్తింపు సాధించడం సులభతరం అవుతుందని న్యాక్ మాక్ పీర్ కమిటీ అభిప్రాయపడింది. న్యాక్ గుర్తింపు కోసం జేఎన్‌టీయూ యాజమాన్యం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో మాక్ పీర్ కమిటీ రెండు రోజుల పాటు వర్సిటీలో పర్యటించింది. పలు విభాగాలను పరిశీలించింది. అనంతరం వీసీ రంగజనార్ధన, వివిధ విభాగాల అధిపతులతో గురువారం సమావేశం నిర్వహించింది. వర్సిటిని మరింత అభివృద్ధి చేయడానికి అవసరమైన సలహాలు, సూచనలు చేసింది. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, ఐక్యూఏసీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, వివిధ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం




రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 11: ఉమ్మడి జిల్లాలో ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు, గృహిణులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక రూడ్‌సెట్ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు రూడ్‌సెట్‌లో 606బ్యాంచ్‌లకు గాను 18వేల మందికి పైగా శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఈ కొత్త ఏడాదిలో కంప్యూటర్ ట్యాలీ, టైలరింగ్, పికెల్ మేకింగ్, జూట్‌బ్యాగుల తయారీ, సెల్ ఫోన్ రిపేరీ, ఫొటోగ్రఫీ-వీడియోగ్రఫీ, డ్రైవింగ్, ఏసీ-ఫ్రిజ్ రిపేరీల్లో శిక్షణలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు, గృహిణులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 08554-255925, 94409 05479లను సంప్రదించాలని కోరారు.

వ్యక్తిపై హత్యాయత్నం

అనంతపురం క్రైం, జనవరి 11: స్థానిక బుడ్డప్పనగర్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు.. డిష్ పని చేసే గోవిందరాజులు, ఆటో డ్రైవర్ అశోక్‌కుమార్ అక్కచెల్లెల్ల కొడుకులు. గోవిందరాజులు కుటుంబం విన్సెంట్ ఫెర్రర్‌నగర్‌లో, అశోక్‌కుమార్ కుటుంబం నేతాజీనగర్‌లో నివాసముంటోంది. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో గోవిందరాజులు అశోక్‌కుమార్ ఇంటికి వచ్చి అతన్ని పిలుచుకెళ్లాడు. బుడ్డప్పనగర్‌లో పాత ఏసీబీ కార్యాలయం వెనుక వైపు సందులో ఓ ఇంటి వద్ద అర్ధరాత్రి సమయంలో అశోక్‌కుమార్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. కళ్లల్లో కారం కొట్టి.. గొంతు కోసి.. వేటకొడవలితో తలపై నరకడంతో అతను అక్కడే పడిపోయాడు. ఆ శబ్దానికి ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఆ ఇంటి యజమాని.. గాయపడ్డ అశోక్‌ను ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. పోలీసులకు సమాచారం అందించాడు. అశోక్‌కుమార్‌కు ఆపరేషన్ చేసి ఐసీయూలో వైద్య సేవలు అందిస్తున్నారు. దర్యాప్తు చేసిన పోలీసులు గోవిందరాజులు, అశోక్ కుమార్ మధ్య డబ్బు విషయంలో నెలకొన్న విభేదాలే ఈ దాడికి దారి తీస్తున్నట్లు తేలింది. గోవిందరాజులే ఈ దాడి చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. గోవిందరాజులు బెంగుళూరుకు వెళ్లి మొబైల్ స్విచ్ఛాఫ్ చేసినట్లు సమాచారం.

బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా చైతన్య కిషోర్



అనంతపురం సెంట్రల్, జనవరి 11: బీజేపీ రాప్తాడు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా రావి చైతన్య కిషోర్ నియమిస్తూ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ నియామక ఉత్తర్వులను గురువారం జారీచేశారు. ఓ ఫౌండేషన్ ద్వారా పలు సేవాకార్యక్రమాలు నిర్వహించిన కిషోర్.. అనంతపురం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసుల అధ్యక్షతన ఆ పార్టీలో చేరారు. అనంతపురం రూరల్ మండల కన్వీనర్‌గా పనిచేస్తున్న అతన్ని తాజాగా రాప్తాడు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా నియమించారు.

నూతన కమిషనర్ నేడు బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం, జనవరి 11 : అనంతపురం నగర కమిషనర్‌గా మేఘ స్వరూప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గురువారం రాత్రి ఆయన ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వచ్చారు. నగరపాలక అధికారులు, ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు.

రైతులపై భగవంతుడి కరుణ ఉండాలి

● మాజీ మంత్రి కాలవ



ఊరేగింపులో పాల్గొన్న కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, జనవరి 11: రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని అలాంటి రైతులపై ఆ భగవంతుడి కృప ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. మూడు, నాలుగు ఏళ్లుగా వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని, రాబోవు రోజులలో పుష్కలంగా వర్షాలు కురవాలని ఆ దేవుడిని కోరుకుంటున్నానన్నారు. మండలంలోని వనగుడ్డం గ్రామంలో పవాడ పురుషుడు గాదిలింగప్ప తాత ప్రవచనాలను 15 రోజులుగా నిర్వహిస్తున్నారు. గురువారం అమావాస్య రోజు ఘనంగా గాదిలింగప్ప తాత ప్రవచన ఉత్సవాలు ముగించారు గాదిలింగప్ప తాత విగ్రహాన్ని డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమానికి రూ.5 వేలు కానుకగా కాలవ శ్రీనివాసులు అందించారు. గ్రామస్థులు కాలవ శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నాగల్లి రాజు, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలి: విద్యార్థులు తమ ప్రతిభతో తమ తల్లిదండ్రులకు, గ్రామానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మడేనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బసమ్మ, మీనాక్షి, సుస్మిత, గంగమ్మ, వరలక్ష్మి, నాగరత్న, గీతాంజలి, రాధిక అనే విద్యార్థులు అఖిలభారత క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. వీరికి కాలవ శ్రీనివాసులు రూ.16 వేలు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగల్లి రాజు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

టీడీపీలోకి చేరిన వైసీపీ మాజీ సర్పంచు



టీడీపీ కండువా వేసి కృష్ణయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 11: పట్టణంలోని చేనేత కాలనీకి చెందిన వైసీపీ మద్దతుదారుడు, గన్నెవారిపల్లి మాజీ సర్పంచు లింగం కృష్ణయ్య గురువారం సాయంత్రం ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా జేసీ అశ్మిత్‌రెడ్డి చేనేతకాలనీలో పర్యటించారు. అశ్మిత్‌రెడ్డిని మాజీ సర్పంచు కృష్ణయ్య ఇంటిలోకి ఆహ్వానించారు. నాయకుల సమక్షంలో కృష్ణయ్యకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలోకి రావడం సొంతింటిలోకి వచ్చినట్లుగా ఉందని కృష్ణయ్య అన్నారు. టీడీపీ ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, నాయకులు చింబిలి ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న కళాశాల కరస్పాండెంట్ ఓంకారప్ప, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్, జనవరి 11: పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులో ఉన్న శ్రీ వివేకానంద ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో గురువారం, అమెరికాలో వెలసిన ఆప్తా కళాశాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు రకరకాల రంగువల్లులు వేశారు. కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ముందే వచ్చిందన్న భావన కలుగుతోందన్నారు. తెలుగు సంస్కృతి సంప్రదాయం ఉట్టిపడేలా ఉందన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఓంకారప్ప, ప్రిన్సిపాల్ హనుమాన్‌ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఈఆర్వో హాజరు కాని సమావేశాలు ఎందుకు?'



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీ నాయకులు

ఉరవకొండ, జనవరి 11: ఈఆర్వో హాజరు కానప్పుడు రాజకీయ పార్టీల సమావేశాలు నిర్వహించి ఏమి ప్రయోజనమని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఫారం-6కు సంబంధించి తిరస్కరణకు గురైన జాబితా ఇవ్వాలని అడుగుతున్నా సమాధానం చెప్పడం లేదని ఏఈఆర్వోను నిలదీశారు. ఓటర్ల జాబితాలో మృతిచెందిన, డబుల్ ఎంట్రీ ఓట్లు తొలగించేందుకు ఓటర్ల సవరణ కార్యక్రమం ఉద్దేశమని తహసీల్దారు శ్రీధర్‌మూర్తి తెలిపారు. పెళ్లై వెళ్లిపోయిన ఓటర్లు తొలగించాలని వైసీపీ నాయకులు ఏఈఆర్వోను కోరారు. తహసీల్దారు ఈరమ్మ, ఓబులేశు, టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, మల్లికార్జున, రాము, సీపీఎం నాయకులు మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీన, ఓబులేశు, జనసేన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెంకటస్వామి మృతికి నివాళి

గుంతకల్లుటౌన్, జనవరి 11: పట్టణంలోని సోఫియా స్ట్రీట్‌లో వ్యాపారవేత్త ఇల్లూరు వెంకటస్వామి గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ ఆయన స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇల్లూరు వెంటకస్వామి కుమారుడు ఇల్లూరు కేదార్‌నాథ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేశప్ప, జింకల జగన్నాథ్, నందీశ్వర్ పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన' సభ్యుడిగా రామాంజనేయులు

గుంతకల్లుటౌన్, జనవరి 11: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడిగా పట్టణానికి చెందిన కొలిమి రామాంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు నియమాక ఉత్తర్వులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నాగేశ్వరరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకున్నట్లు రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జగన్ చేతగానితనం వల్లే నిరుద్యోగం

● మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు

గుంతకల్లు, జనవరి 11: పరిపాలన చేతగాని జగన్ నిర్వాకం వల్లే రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిందని మాజీ శాసనసభ్యుడు ఆర్ జితేంద్ర గౌడు అన్నారు. గురువారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం కారణంగా కొత్త కంపెనీలు, ఫ్యాక్టరీలు రావడం లేదన్నారు. దీంతో నిరుద్యోగం తాండవిస్తోందని విమర్శించారు. ఈ కారణంగానే చంద్రబాబు చేపట్టిన రా.. కదలిరా కార్యక్రమానికి అశేష జనవాహిని కదలి వస్తోందన్నారు. రాష్ట్రంలో శాంతి స్థాపన, అభివృద్ధిని సాధించే లక్ష్యంతో చంద్రబాబు ఎన్నికలకు వెళ్తున్నారని తెలిపారు. జగన్ మాత్రం ఇచ్చిన హామీలను పక్కనపెట్టి జనాన్ని మద్యంలో ముంచెత్తుతున్నాడని, కల్తీ మద్యాన్ని తాపి పేదల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నాడని అన్నారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, వాల్మీకి సాధికార సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి మస్తానప్ప, బీసీ సెల్ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు టీ కేశప్ప, నాయకులు రాయల్ రామయ్య, రంజాన్, ఫజులు, జగన్నాథ్ పాల్గొన్నారు.

రా...కదలిరా... సభలతో వైసీపీలో వణుకు
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా

కళ్యాణదుర్గం: టీడీపీ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రా...కదలిరా...సభలకు ప్రజలు నీరాజనం పలుకుతుండడంతో వైసీపీ ప్రభుత్వంలో వణుకు పుట్టిందని నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయహో బీసీల పేరుతో టీడీపీ పార్టీ ప్రతి పార్లమెంటు, మండల, గ్రామస్థాయిలో ప్రజల్లోకి వెళ్తోందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అన్ని విధాలుగా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గల్లంతు చేయడానికి రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ మాదినేని మురళి, పార్లమెంట్ కార్యదర్శి తలారి సత్తి, పార్లమెంట్ అధికార ప్రతినిధి రామరాజు, మండల కన్వీనర్ ధనుంజయ, గోవిందు, మల్లి, వెంకటేశులు, ఎరుకుల హరి, వర్లి రాజు, చక్రపాణి, బ్రిజేష్, తిమ్మప్ప, లక్ష్మన్న పాల్గొన్నారు.

దళిత, బీసీ, మైనార్టీల ద్రోహి జగన్

గుంతకల్లు: దళితులకు, బీసీలకు, ముస్లిం మైనారిటీలకు జగన్ తీరని ద్రోహం చేశాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ విమర్శించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. తనది దళిత, బీసీ, మైనార్టీల ప్రభుత్వం అంటూ ఏ అవసరానికి ఆ మాట మాట్లాడిన జగన్ నాలుగున్నరేళ్ల పరిపాలనలో వారెవరినీ వదలకుండా అందరినీ వంచించాడన్నారు. 25 మంది దళితులు హత్యకు గురయ్యారన్నారు. అగ్రవర్ణ మహిళపై అత్యాచారం జరిగితే ఒకలాగ, దళిత యువతి మానభంగం, హత్యకు లోనైతే ఒకలా ప్రవర్తించి దళితులను వంచించాడన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు జరుగుతున్న అన్యాయాన్ని, ద్రోహాన్ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలన్నారు. బొజ్జే నాయక్, కే జగదీశ్, లక్ష్మీనారాయణ, అశోక్, న్యాయవాది సురేశ్, మీనా, చాంద్‌బాషా, సంగాల రాము పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్రస్.. టీడీపీ: పీజేఆర్



పామిడి: అభివృద్ధికి తెలుగుదేశంపార్టీ అడ్రస్సుగా నిలిచిందని టీడీపీ నాయకులు, పీజేఆర్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానంద రెడ్డి అన్నారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలోని వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభు త్వం టీడీపీ అభివృద్ధి, సంక్షేమ పథకాలనే అనుసరించిందన్నారు. ఆ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు. వైసీపీ ప్రభు త్వ సంక్షేమం, అభివృద్ధిలో పూర్తిస్థాయిలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఎప్పుడెప్పుడు ఎన్నికలు జరుగుతాయా.. అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ఆయన జోస్యం చెప్పారు.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ..?

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి



కళ్యాణదుర్గంలో కరపత్రాలు పంచుతున్న ఉన్నం



పామిడిలో రైతులతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్



కరపత్రాలు పంచుతున్న పత్తి హిమబిందు

కళ్యాణదుర్గం, జనవరి 11: ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని గొప్పలు చెబుతున్నా వైసీపీ ప్రభుత్వం ఎక్కడ విడుదల చేసిందో చూపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి ప్రశ్నించారు. గురువారం శెట్టూరు మండల పరిధిలోని బొచ్చుపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు గోళ్ల వెంకటేశులు, గురుప్రసాద్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వచ్చేది రైతు రాజ్యమే
- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్

పామిడి: రాష్ట్రంలో రెండు నెలలు తర్వాత వచ్చేది రైతు రాజ్యమేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ అన్నారు. మండలంలోని గజరాంపల్లి, పొగరూరు గ్రామాలలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలుపై అవగాహన కల్పించారు. దేవాలయం, రచ్చకట్ట వద్ద రైతులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గుంతకల్లు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బండారు ఆనంద్, టీడీపీ మండల కన్వీనర్ మునలిరెడ్డి, రామలింగారెడ్డి, పరుశురాంయాదవ్, రామాంజనేయులు యాదవ్, రంగారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సాంబశివ, వీరాంజనేయులు, వీరారెడ్డి, చాంద్‌బాషా, ఖాదర్ పాల్గొన్నారు.

వైసీపీతోనే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం

రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఆర్థిక సంక్షోభం నెలకొందని టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు అన్నారు. మండలంలోని పాళ్యం గ్రామంలో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల నాయకులు ప్రతాప్, అంజి, తిరుపాలు, మునీంద్ర, ఓబులేసు, లక్ష్మీనారాయణ, రామాంజనేయు లు, తిరుపాలు, చాగంటి గోవిందరాజులు, నారాయణ, మనోహర్, వెంకట నరసింహుడు, ఉమానాయక్, మాధవి, గోవిందమ్మ, రాధా పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి

గుంతకల్లు, జనవరి 11: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు. గురువారం ఉదయం ఓపీఎస్ పునరుద్ధరణపై మజ్దూర్ యూనియన్ నాయకులు స్థానిక డీఆర్ఎం కార్యాలయం వద్ద ఒక రోజు నిరాహార దీక్షా చేట్టారు. యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానంతో రైల్వే ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు. ఉద్యోగులకు ఏమాత్రం ఇష్టంలేని ఈ విధానాన్ని బలవంతంగా రుద్దారన్నారు. యూనియన్ నాయకులు మస్తాన్ వలిపాల్గొన్నారు. నిరాహార దీక్షకు మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్ర గౌడు టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. జితేంద్రగౌడు మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అన్నారు. మద్దతు తెలిపిన వారిలో ఆర్ పవన్ కుమార్ గౌడు, అనిల్ కుమార్ గౌడు, టీ కేశప్ప, తలారి మస్తానప్ప, హనుమంతు, ముక్కన్నగారి రామాంజనేయులు, మన్నూ ఖాన్, ఉడదాల శివ, ఉన్నారు. అలాగే పత్తి హిమబిందు విడిగా వెళ్లి ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

జయహో బీసీ సదస్సును జయప్రదం చేయండి

గుంతకల్లు, జనవరి11: మండలంలోని పాతకొత్తచెరువులో జరగనున్న జయహో బీసీ సదస్సును జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సదస్సును ఉంటుందని, నియోజకవర్గంలోని బీసీ కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జేసీపీఆర్ రాకతో పరారైన ఇసుక అక్రమ తరలింపు దారులు



మాట్లాడుతున్న జేసీపీఆర్

పెద్దపప్పూరు, జనవరి 11: మండలకేంద్రంలోని పెన్నానదిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు తాడిపత్రి నుంచి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఇసుక తరలింపుదారులు పరారయ్యారు. మండలకేంద్రంలోని పెన్నానదిలో ఇసుకరీచ్ పేరుతో అక్రమంగా ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా పెద్దఎత్తున తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న జేసీ అడ్డుకొనేందుకు వచ్చారు. విషయం ముందుగానే పసిగట్టిన వైసీపీ మద్దతుదారులు ట్రాక్టర్లు, టిప్పర్లతో అక్కడి నుంచి పరారయ్యారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తన రాకను చూసి ఇసుక అక్రమ దారులు పరారయ్యారన్నారు. నాలుగేళ్లుగా ఇసుక తరలింపును అడ్డుకొనేందుకు పలు రకాలుగా ప్రయత్నించామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో ప్రజలే అడ్డుకోవాలని పిలుపునిచ్చామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధికి నేను వ్యతిరేకిని కానని ఇతర జిల్లాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్న వారికి వ్యతిరేకంగా పోరాడుతున్నానని ఆయన తెలిపారు.

వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి



గుత్తిలో ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుత్తి, జనవరి 11: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారకంగా నిర్వహించాలని ఓసీసీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహం వద్ద గురువారం ఆ యన 217వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వరదరాజులు, వెంకటరాముడు, తిరుపాల్, సుంకన్న, చంద్ర, ఆంజనేయులు, తెలుగు యువత నాయకుడు సుధాకర్ నాయుడు, విజయ్‌భాస్కర్, అంజన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఉరవకొండ: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్నను స్మరించుకోవడం మనందరి బాధ్యత వడ్డెర సంఘం నాయకులు అన్నారు. పట్టణంలో వడ్డే ఓబన్న 217వ జయంతిని పురస్కరించుకుని గురువారం ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ వడ్డే ఓబన్న తన జీవితాన్ని స్వాతంత్ర్యం కోసం త్యాగం చేశారన్నారు. భీమేష్, హంపయ్య, గంగరాజు, శివరుద్ర, ధనంజయ, చిరంజీవి, రామాంజనేయులు పాల్గొన్నారు.

యాడికి: వడ్డెర్ల ఆరాధ్యదైవం వడ్డే ఓబన్న అని వడ్డెర సంఘం నా యకులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాయదుర్గం: పట్టణంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గురువారం వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. వినాయక సర్కిల్ వద్ద వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ వడ్డెర్ల అభివృద్ధి కోసం వడ్డే ఓబన్న అడుగుజాడల్లో నడుస్తామని తెలిపారు.

జగన్ ప్రభుత్వానికి పాడె కడదాం

● జయహో బీసీ సభలో ఉమామహేశ్వరనాయుడు



బీసీ గర్జన సభకు తరలివస్తున్న ఉమామహేశ్వర నాయుడు, టీడీపీ నాయకులు

బ్రహ్మసముద్రం, జనవరి 11: బీసీ ఓట్లతోనే గెలిచిన వైసీపీ ప్రభుత్వం, చివరికి వారిపైనే దాడులు చేయించిన ఘనత సైకో జగన్ రెడ్డికే దక్కిందని, జగన్ ప్రభుత్వానికి పాడె కడదామని టీడీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. గురువారం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు నేతృత్వంలో జయహో బీసీ కార్యక్రమాన్ని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమా మహేశ్వరనాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అండగా నిలిచిన ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కిందన్నారు. నేడు జగన్ రెడ్డి బీసీ పదవులను వాడుకుని తాడేపల్లి ప్యాలెస్‌ను వేదికగా బీసీలపైనే దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మనమందరం సమష్టిగా వైసీపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేద్దామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వరయాదవ్, సాధికారిక కమిటీ అధ్యక్షుడు కురుబ రమణ, కుమ్మర పోతులయ్య, బీసీ సంఘం నాయకులు లక్ష్మీ నరసింహులు, సుధాకర్ నాయుడు, పాలబండ్ల శ్రీరాములు, కురుగౌడ, నీలాస్వామి, తలారి సత్యప్ప, ధనుంజయ, రామరాజు, నాగరాజు, ఓబుళేసు, లోలూరు నారాయణ స్వామి, బ్యాళ్ల నాగేంద్ర, బ్యాళ్ల రాము, కురుబ చంద్రశేఖర, కుమ్మర ఓబుళపతి పాల్గొన్నారు. శెట్టూరు మండలం లింగదీర్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రామన్న బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమానికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో విషయం తెలుసుకుని బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు ఆయనను పరామర్శించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి అతని వైద్య ఖర్చుల నిమిత్తం చంద్రన్న స్ఫూర్తితో ఉమన్న ఆర్థిక సాయం కింద రూ. 5 వేలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుట్లూరు, జనవరి 11: మండల కేంద్రం శివారు తాడిపత్రిరోడ్డులో బైక్ అదుపుతప్పి బాలాపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలాపురం నుంచి పనినిమిత్తం తాడిపత్రికి వెళుతుండగా రోడ్డులో టిప్పర్ల నుంచి జారిపడిన బెలుకు మట్టిపై వెళ్లడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు గాయాలు కావడంతో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆడుదాం ఆంధ్రాలో ఘర్షణ

రాయదుర్గం, జనవరి 11: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలలో గురువారం రెండు జట్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గంటపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం రాయదుర్గం పట్టణం, జుంజురంపల్లి గ్రామాలకు సంబంధించిన కబడ్డీ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా పోటీ నడుస్తున్న నేపథ్యంలో ఆట ముగిసే సమయానికి అంపైర్ రెండు పాయింట్లు జుంజురంపల్లి జట్టుకు ఇవ్వాల్సి ఉండగా ఒక్క పాయింట్ ఇవ్వడంతో రగడ మొదలైంది. తమకు రెండు పాయింట్లు ఇవ్వాలని అంపైర్ మీద ఒత్తిడి తీసుకురావడంతో మరో జట్టు రంగంలో దిగి జుంజురంపల్లి క్రీడాకారులతో వాగ్వాదానికి దిగింది. దీంతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. గంటపాటు క్రీడాపోటీలను వాయిదా వేశారు. హుటాహుటిన మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డితో పాటు పోలీసులు అక్కడకు చేరుకుని గొడవను సద్దుమణిగేలా చేశారు. కాగా అంపైర్ నిర్ణయమే అంతిమమని స్పష్టం చేసి ఇరుజట్లను సముదాయించి క్రీడలను గంట అనంతరం మొదలు పెట్టారు.

విద్యార్థిని ఆత్మహత్య

పామిడి, జనవరి 11: పట్టణంలోని యల్లమ్మ వీధిలో నివాసం ఉంటున్న పీజీ విద్యార్థిని శ్రీలయ(22) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని 1వ వార్డు పాఠశాల సమీపాన పాండురంగారావు, స్వప్న దంపతులు కుట్టుమిషన్ కుట్టుకుంటూ జీవనం సాగించేవారు. పెద్దకుమార్తె శ్రీలయ అనంతపురంలోని ఎస్కేయులో పీజీ చదువుతోంది. సంక్రాంతి సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. చిన్న కుమార్తె తేజస్విణి అనారోగ్యానికి గురవడంతో గురువారం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేదని, కడుపునొప్పి తాళలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్, జనవరి11: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో గురువారం ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.26000 స్వాధీనం చేసుకున్నామని ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని అరె స్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇంటర్ విద్యార్థి మృతి

తాడిపత్రిటౌన్, జనవరి 11: మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామసమీపంలో గురువారం రాత్రి బైక్ అదుపుతప్పి కిందపడ్డ సంఘటనలో ఇంటర్ విద్యార్థి షేక్ మహమ్మద్ అబ్దుల్‌గని (17) మృతిచెందినట్లు రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బుగ్గ గ్రామానికి చెందిన ఆదాం షరీఫ్ కుమారుడు అబ్దుల్‌గని అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా విద్యార్థి స్వగ్రామానికి వచ్చాడు. గురువారం బైక్‌పై తాడిపత్రికి వచ్చిన ఆయన తిరుగుప్రయాణంలో వెంకటరెడ్డిపల్లి గ్రామసమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అబ్దుల్‌గని మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ వద్ద అలజడి

ఉరవకొండ, జనవరి 11: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద చీటీల వ్యవహారం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలకు దారి తీసింది. ఉరవకొండకు చెందిన కొందరు మహిళలు, అనంతపురంలో చీటీల డబ్బులు కట్టారు. వారు ఇవ్వకపోవడంతో మహిళలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వారిని స్టేషన్‌కు పిలిపించారు. మాట్లాడుతున్న సమయంలో ఇరువర్గాలు వాదనకు దిగారు. దీంతో స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి పక్కకు పంపించారు.

టీడీపీ అనుబంధ కమిటీల ప్రకటన

యాడికి, జనవరి 11: టీడీపీ అనుబంధ కమిటీలను నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రకటించారు. యాడికి పట్టణ కమిటీ అధ్యక్షుడిగా వెలిగండ్ల ఆదినారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షుడిగా శోభన్‌బాబు, తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాలిగా బట్టా అనిత, బీసీ విభాగం అధ్యక్షుడిగా తిరంపురం నీలకంఠ, ఐ-టీడీపీ అధ్యక్షునిగా నరసింహచౌదరి, రైతు సంఘం కమిటీ అధ్యక్షుడిగా బయపురెడ్డి, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సుభాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌లను ప్రకటించారు.



గుత్తిలో నోటీసులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



యాడికిలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



బొమ్మనహాళ్‌లో...



బ్రహ్మసముద్రంలో దీక్షకు కాంగ్రెస్ నాయకుల మద్దతు

షోకాజ్ నోటీలతో ఉద్యమం ఆగదు

షోకాజ్ నోటీసుల పేరుతో బెదిరింపులు తగవని, సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. మరోవైపు ఐసీడీఎస్ అధికారులు తాళాలు తెరవని అంగన్‌వాడీ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు అతికించారు. దీనిపై కార్యకర్తలు మండిపడుతున్నారు. - ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



విడపనకల్లులో అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

325 గ్రామాల్లో గొంతెండుతున్నా.. దిగిరాని అధికారులు

● 12వ రోజుకు చేరిన శ్రీరామిరెడ్డి కార్మికుల ఆందోళనలు
● సంక్రాంతి పండుగకు కూడా పస్తులుండాల్సిందేనా?

కళ్యాణదుర్గం, జనవరి 11: కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి కార్మికుల ఆందోళనలు ఆగడం లేదు. 12 రోజులుగా ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా, సంబంధిత అధికారులు దిగి రావడం లేదు. సంక్రాంతి పండుగకు కూడా పస్తులుండాల్సిందేనని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పంప్‌హౌస్‌కు తాళాలు వేసి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫేస్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె ప్రభావంతో 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. 5 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.



పంపుహౌస్ వద్ద నినాదాలు చేస్తున్న శ్రీరామిరెడ్డి కార్మికులు